## క్లుప్తంగా

### పైడిమాంబ.. చల్లగ చూడమ్మా



భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

గోపాలపట్నం: గోపాలపట్నం పైడితల్లి అమ్మవారి పండగ మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. మొక్కులు ఉన్నవారు చీరలు, గాజులు సమర్పించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పరసకు భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

### విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలు



గాయాలపాలైన వ్యక్తి

మల్కాపురం: జనతా కాలనీ ప్రాంతానికి చెందిన వినోద్ అనే వ్యక్తి మంగళవారం తన ఇంటి నుంచి జవహర్‌నగర్ వైపు వచ్చాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఓ చెట్టు వద్దకు వచ్చి అక్కడ జియో నెట్ వర్క్ స్తంభానికి చేరబడ్డాడు. దీంతో ఆయన షాక్‌కు గురయ్యాడు. జియో నెట్‌వర్క్ స్తంభానికి సమీపాన విద్యుత్ స్తంభం ఉంది. దాని వైర్లు చెట్టుకొమ్మలకు తగలడం, ఆ చెట్టు కొమ్మలు జియో నెట్‌వర్క్ స్తంభానికి అంటుకుని ఉండడంతో విద్యుత్ జియో స్తంభానికి వచ్చి ఉండవచ్చునని స్థానికులు భావిస్తున్నారు. షాక్‌కు గురైన వినోద్ పక్కన ఉన్న కాలువలో పడిపోయాడు. దీంతో ఆయనకు ముక్కు భాగంలో,మెడ దిగువ భాగంలో గాయాలైనట్లు అక్కడి వారు చెబుతున్నారు.వెంటనే అతని బంధువులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకు వెళ్లారు.

### గంజాయితో ఇద్దరి అరెస్ట్

గోపాలపట్నం: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకుని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు మాటు వేసి నిందితులను పట్టుకుని వారి నుంచి 11 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరు కేరళ రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించారు. తీరు వెల్ల థామస్(27), చారోన్(24) అరకులో గంజాయి కొనుగోలు చేసి కేరళ తీసుకు వెళ్లేందుకు యత్నిస్తుండగా రైల్వే స్టేషన్ దగ్గరలో పట్టుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### అన్నమయ్య కీర్తనల శిక్షణ ప్రారంభం



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి

అగనంపూడి : అన్నమాచార్యుని సంకీర్తనలు ఆనందానుభూతి కలిగిస్తాయని తిరుమల తిరుపతి దేవస్థానం గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కణితి పునరావాస కాలనీ గవర వీధిలోని రామాలయంలో కాపారపు ఫౌండేషన్, గీతాచార్య భక్తి గీతాంజలి గౌరీ సేవా సంఘం సంయుక్తంగా నిర్వహించిన వేదర్ష అన్నమాచార్య సంకీర్తన శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామికి సంకీర్తనలను అంకితం చేసి కైవల్యం పొందారన్నారు. నేటి సమాజంలో సనాతన ధర్మం, భక్తి భావన దూరం అవుతున్నాయని, ఈ క్రమంలో ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టిన నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈనెల 24వ తేదీన సంకీర్తన యజ్ఞం నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కాపారపు ఫౌండేషన్ ప్రతినిధి కాపారపు శివన్నాయుడు, భాస్కర్‌భట్ల సత్య ప్రసాద్‌శర్మ, బెండి సత్యం, శీపాన రమేష్‌బాబు, పట్టా రామ అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ, గన్నం రాజు గిరిబాబు, నాగమణి, వివిధ ప్రాంతాల భజన బృందాలు పాల్గొన్నాయి.



వైద్యసేవల కోసం ఆస్పత్రికి వచ్చిన రోగులు



యువతి ఆరోగ్య సమస్య తెలుసుకుంటున్న డాక్టర్ రేవతి

# పేదోళ్లకు పెద్దదిక్కు..!

- యూపీహెచ్‌సీ ఆధునికీకరణతో మెరుగైన సేవలు
- ఉచితంగా రక్త పరీక్షలు, మందులు
- విశేష సేవలు అందిస్తున్న బుచ్చిరాజుపాలెం అర్బన్ హెల్త్ సెంటర్



సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహిస్తున్న డాక్టర్ రేవతి

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం పేదోళ్ల ఆరోగ్య పరిరక్షణకు పెద్ద దిక్కుగా మారింది. జీవీఎంసీ 90వ వార్డులోని ఎనిమిది సచివాలయాల పరిధిలోని సుమారు 27 వేల మందికి వైద్య సేవలు అందించేలా యూపీహెచ్‌సీ ఏర్పాటు చేశారు.ఇక్కడి వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో అటు 89వ వార్డు, ఇటు 52వ వార్డు పరిధిలోని కాలనీల నుంచి కూడా రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. ఎన్ఏడీ చుట్టూ ఉన్న శివారు కాలనీల ప్రజానీకానికి అత్యవసర సమయంలో బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ ద్వారా విశేష సేవలు అందుతున్నాయి.

**గతంలో సేవలు అంతంతమాత్రమే**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాక ముందు అర్బన్ హెల్త్ సెంటర్లు ఎప్పుడు తెరుస్తారో తెలియని పరిస్థితి. వైద్యులు కూడా సక్రమంగా రాకపోవడంతో ప్రజలు ప్రైవేటు వైద్యులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బంది పడేవారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. పట్టణాల్లో ఉన్న ఆస్పత్రుల్లో కూడా మెరుగైన సౌకర్యాలు కల్పించింది. ఆస్పత్రికి అవసరమైన మౌలిక సౌకర్యాలతో పాటు పక్కా భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో పట్టణ ఆరోగ్య కేంద్రాలు కార్పొరేట్ లుక్ సంతరించుకున్నాయి.

**నాణ్యమైన వైద్య సేవలు**

బుచ్చిరాజుపాలెం పట్టణ ఆరోగ్యకేంద్రంలో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్యురాలు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణకు ఒక హెల్త్ సూపర్‌వైజర్ పనిచేస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 50 నుంచి 70 వరకు ఓపీ నమోదు అవుతుంది. రోగులకు పరీక్షల అనంతరం మందులను ఉచితంగా అందిస్తున్నారు.

**ఉచితంగా రక్త పరీక్షలు**

రోగి వ్యాధి నిర్ధారణకు రక్త పరీక్షలు చేయించుకోవటంతో ఎంతో ముఖ్యం. జ్వరంతో ప్రైవేటు ఆస్పత్రికి వెళితే, రక్త పరీక్షల పేరిట రూ.1500ల వరకు గుంజేస్తున్నారు.కానీ బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీలో మలేరియా, డెంగ్యూ, సుగర్ పరీక్షలతో పాటు, కిడ్నీ సంబంధిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగానే చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 69 రకాల వ్యాధులకు సంబంధించిన నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు.

**బాధ్యతతో విధులు**



వైద్యం కోసమం ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన సేవలు అందించేలా బాధ్యతతో పనిచేస్తున్నాం. రోగుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నాం. దీని వల్ల సేవల్లో పారదర్శకత ఉంటుంది. గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహిస్తుంచడంతో పాటు ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. సిబ్బందితో సమీక్షించుకొని లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తున్నాం.

– డాక్టర్ రొంగలి రేవతి, యూపీహెచ్‌సీ వైద్యురాలు

## కళాకృతుల తయారీలో శిక్షణ



శిక్షణలో పాల్గొన్న చిన్నారులు



చిన్నారులు తయారీ చేసిన కళాకృతులు చూపుతున్న అనసూయాదేవి తదితరులు

మల్కాపురం: పనికి రాని వ్యర్థ పదార్థాల నుంచి మంచి వస్తువులు తయారు చేసుకోవచ్చునని జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం వ్యర్థ పదార్థాల నుంచి వివిధ కళాకృతుల తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పనికి రాని పేపర్లు,గ్లాస్‌లు,క్లాత్ ఇతర పదార్థాలతో పలు వస్తువులు తయారు చేసుకోవచ్చునన్నారు. చేతి వృత్తుల్లో చిన్నారులకు శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో నైపుణ్యం వెలుగు చూస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు వై.అనసూయాదేవి,గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పైడితల్లమ్మ జాతర



పైడితల్లమ్మను దర్శించుకున్న కార్పొరేటర్ లక్ష్మణరావు, ఇతర నాయకులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు అల్లూరి సీతారామరాజుకాలనీలో వెలసిన పైడితల్లమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ముగింపు ఉత్సవాల్లో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామ దేవతలు గ్రామాల్లోకి ఎటువంటి దుష్టశక్తులు రాకుండా కంటికి రెప్పలా కాపాడుతాయన్నారు. అదే విధంగా ప్రతి వ్యక్తి దైవచింతన కలిగి ఉండాలని, తద్వారా మనసు ప్రశాంతంగా ఉంటే మంచి ఆలోచనలు వస్తాయన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీశెట్టి గణేష్, నాయకులు లక్ష్మణ్, ఫణికుమార్, గంగాధర్, రఘు, మాధవ, నాగరాజు, పరశురాము పాల్గొన్నారు.

## జీతాలు చెల్లించకపోవడం ప్రైవేటీకరణ ఎత్తుగడలో భాగమే



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న వరసాల శ్రీనివాసరావు

అగనంపూడి: తొమ్మిది వందల కోట్ల రూపాయల అడ్వాన్స్ రూపేణా ఉక్కు యాజమాన్యం సేకరించినా నేటికి ఉక్కు ఉద్యోగులు జీతాలు చెల్లించకపోవడం, ప్రైవేటీకరణ ఎత్తుగడలో భాగమేనని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలి వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. 1,195 రోజులుగా ఆందోళన చేస్తున్నా, యాజమాన్యంలోగాని, ప్రభుత్వాల్లోగాని కనీసం స్పందన లేకపోవడం, కావాలని కార్మికుల జీతాలు చెల్లించకుండా తాత్సారం చేస్తుండడం అన్యాయమన్నారు. అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు ఉక్కులోని డెడికేషన్ పార్కు వద్ద బుధవారం ఉదయం పది గంటలకు వేలాది మంది కార్మికులు పాల్గొని నిరసన తెలపేందుకు నిర్ణయించామని, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ పాలనలో నియమితులైన ఉక్కు సీఎండీలు, డైరెక్టర్లు వివాదస్పదంగా వ్యవహరిస్తూ అనవసర ఖర్చులు తగ్గించకుండా యథేచ్ఛగా షికార్లు చేస్తున్నారని, ఈవిషయంలో ఉక్కు మంత్రిత్వశాఖ బోద్యం చూస్తోందని ఆరోపించారు. ఈవ్యవహారాలపై సీబీఐ, విజిలెన్స్ అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, మధు, పీఆర్‌కే రాజు, గుమ్మడి నరేంద్ర శ్రీనివాసనాయుడు, దాసరి శ్రీనివాస్, టక్కు సత్యనారాయణ పాల్గొన్నారు.

## గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య



యువకుడి మృతదేహం

గోపాలపట్నం: మర్రిపాలెం రైల్వేస్టేషన్ పరిధిలో గుర్తు తెలియని యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. మర్రిపాలెం రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో ఓ టిఫిన్ దుకాణం ఉంది. అక్కడ రేకుల షెడ్డు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి కేబుల్ వైర్‌తో ఉరి వేసుకున్నాడు. మంగళవారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతుడి వయసు 30 ఏళ్ల ఉంటుందని అంచనా వేశారు. అతను పసుపు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. కుటుంబ సభ్యులెవరైనా మృతదేహాన్ని గుర్తించినట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు సూచించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం ,శేషవస్త్రాలు అందజేశారు.

## అప్పన్నకు లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ పూజలు



అప్పన్న ఆలయంలో లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు. ఒడిశాకు చెందిన భక్తులు ఆయన వెంట ఉన్నారు.

## అంబరాన్నంటిన సతివాడమ్మ తల్లి సంబరం



గౌరపల్లిలో ఘటాలు ఊరేగిస్తున్న భక్తులు



జాతరలో పాల్గొన్న ప్రజలు

పెందుర్తి: గౌరపల్లిలో వెలసిన ఏడు గ్రామాల ఆరాధ్య దేవత సతివాడమ్మతల్లి పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు జరిపారు. భక్తులు పసుపు-కుంకుమలతో పూజలు చేశారు. చీరలు, ముడుపులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అగ్నిగుండాలు తొక్కారు. సాయంత్రం ఘటాల ఊరేగింపు అట్టహాసంగా సాగింది. ప్రజలు పిండి వంటలు, పలు రకాల పండ్లు నైవేద్యంగా సమర్పించారు. ఎలేనుగు సంబరం అంబరాన్ని అంటింది. ఆనవాయితీగా ఉయ్యాల కంబాల ఘట్టం నిర్వహించారు. భజనలు, డప్పుల వాయిద్యాల నడుమ అనుపోత్సవం వైభవంగా చేశారు. పగటి వేషాలతో యువకులు సందడి చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గౌరపల్లి, కోట్నీవానిపాలెం, గంగమ్మపేట, గొల్లలపాలెం, కరకవానిపాలెం, గవరపాలెం, సంతపాలెం గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

## సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎండ ధాటికి చీర పూర్తిగా కప్పకుని వెళ్తున్న మహిళ





సూర్యప్రతాపం నుంచి చున్నీతో రక్షణ

## భానుడి భగ భగ.. జనం విల విల

భానుడు భగ భగ మంటున్నాడు. ఎండ వేడికి తట్టుకోలేక ప్రజలు విలవిల్లాడుతున్నారు. ముఖ్యంగా రాకపోకలు సాగించే పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సర్వీసు రోడ్ల వెంబడి షెల్టర్లు లేకపోవడంతో ఆపసోపాలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. మంగళవారం సూర్యప్రతాపానికి ఇళ్లలో ఉన్న వారు సైతం అవస్థలు పడ్డారు. ఇక తప్పనిసరి పరిస్థితిలో బయటకు వచ్చిన వారు ఎండ దెబ్బకు గురయ్యారు.

– మల్కాపురం



వేడికి తట్టుకోలేక తలపై చున్నీ కప్పకుని వెళ్తున్న మహిళలు

## మస్తానప్పకు సత్కారం



మస్తానప్పను సత్కరిస్తున్న విభాగాధిపతి బాలకుమార్, కుమారస్వామి, నాయకులు

ఉక్కునగరం : స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్పను మంగళవారం సత్కరించారు. ఈ నెలాఖరున ఆయన పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా స్టీల్ మెల్ట్ షాప్-1 విభాగం వైఎస్సార్‌టీయూసీ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విభాగాధిపతి బాలకుమార్, సీసీడీ ఇన్‌చార్జి కుమారస్వామి అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్లాంట్‌లో ప్రతి ఒక్కరూ అభిమానించే అతి కొద్ది మంది నాయకుల్లో మస్తానప్ప ఒకరన్నారు. విభాగాల్లో ఉన్నటువంటి సమస్యలు పరిష్కరించడంలో ఆయన సలహాలు, సూచనలు ఆచరణీయంగా ఉంటాయన్నారు. మస్తానప్ప మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దరిగి రవి, బాబూరావు, ఎం. రాంబాబు, చంద్రశేఖర్, వర్మ, సేథి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## యూజర్ చార్జీల రద్దు కోరుతూ లేఖ

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ పరిధిలో చెత్తపై యూజర్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని సీపీఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి లేఖ పంపారు. ప్రతి ఇంటికి నెలకు రూ.120, మురికివాడల్లో రూ.60 చొప్పున యూజర్ చార్జీలు నిర్ణయించారని, ఈ చార్జీలను సీపీఎం కార్పొరేటర్‌గా తీవ్రంగా వ్యతిరేకించిన విషయం తెలిసిందేనన్నారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు. తక్షణం కౌన్సిల్ సమావేశం నిర్వహించి చెత్తపై యూజర్ చార్జీలు రద్దు చేస్తూ తీర్మానం చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తుందన్నారు.